నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 4 జూలై 2024 | HYDERABAD

బుధవారం నారాయణగూడలో శానిటేషన్ పనులపై ఆరా తీస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

ఆకస్మిక తనిఖీ

సిటీబ్యూరో, హిమాయత్‌నగర్: జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అదనపు కమిషనర్ రవికిరణ్‌తో కలిసి నారాయణగూడ క్రాస్‌రోడ్, శంకర్‌మఠ్ వద్ద రాంకీ ఆర్ఎఫ్‌సీ వెహికల్ డ్రైవర్‌తో కమిషనర్ మాట్లాడి చెత్త తరలింపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. నారాయణగూడ ఫ్లై ఓవర్ సమీపంలో కొత్తగా నిర్మించిన మోడల్ మార్కెట్ పనుల విషయాన్ని అక్కడే ఉన్న చిరు వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు.

మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. దివ్యాంగులకు రూ. 6వేలు, వృద్ధులు, వితంతువులకు రూ. 4వేల పింఛన్లు అందిస్తామని చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి.. ఏడు నెలలు గడుస్తున్నా.. ఇప్పటివరకు హామీని అమలు చేయలేదని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పెంపు కోసం 44,49767 మంది ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. -మేడ్చల్

పూర్తి సమాచారంతో మీటింగ్‌కు రండి

అధికారుల సమీక్షలో కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, జూలై 3 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ సాధారణ సమావేశానికి పూర్తి సమాచారంతో సిద్ధం కావాలని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి అధికారులకు సూచించారు. ఈ నెల 6న నిర్వహించనున్న 9వ సాధారణ సమావేశానికి ఆయా విభాగాల అధికారులతో బుధవారం కమిషనర్ తన చాంబర్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ సమావేశం ఎజెండా అంశాలపై కమిషనర్ చర్చించారు. కౌన్సిల్ సమావేశంలో కొశ్చన్, ఆన్సర్లకు సంబంధించి ఆయా విభాగాల అధికారులు సమగ్ర వివరణ ఇచ్చేలా సిద్ధం కావాలని సూచించారు. పూర్తి సమాచారాన్ని అందించాలని కోరారు. కౌన్సిల్ సమావేశం సాఫీగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా విభాగాలకు సంబంధించిన పలు అంశాలపై ఆమె చర్చించి.. పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఈఎన్‌సీ జియావుద్దీన్, ప్రాజెక్టు సీఈ దేవానంద్, సీఈ కోటేశ్వరరావు, అదనపు కమిషనర్లు శ్రీవాత్సవ, స్నేహ శబరీశ్, శివకుమార్ నాయుడు, నళినీ పద్మావతి, గీతా రాధిక, యాదగిరిరావు, సునందరాణి, సీసీపీ రాజేంద్ర ప్రసాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్థాయీ సంఘం సమావేశం

జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం స్థాయీ సంఘం సమావేశం జరగనున్నది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత మళ్లీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆదాయం పెంపు లక్ష్యంగా జీహెచ్ ఎంసీ కార్యకలాపాలను జీఐఎస్ పరిధిలోకి తీసుకువచ్చిన అధికారులు.. టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి నియో జియో ఇన్ఫో టెక్నాలజీస్ ప్రై.లి సంస్థకు అప్పగించగా, 18 నెలల పాటు సర్వే బాధ్యతల అప్పగింతకు స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆమోదం తెలుపనున్నారు. రహదారుల విస్తరణ, వీఎస్టీ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ అదనపు వ్యయం రూ.139 కోట్లు, భూ సేకరణ, గోపన్‌పల్లిలో జంతువులకు దవాఖాన అంశాలపై చర్చించనున్నారు. 11 అంశాలకు సంబంధించి అన్ని పార్టీలకు సంబంధించిన సభ్యులు చర్చించి ఆమోదం తెలిపిన తర్వాత కౌన్సిల్ ఆమోదానికి ప్రతిపాదనలు పంపనున్నారు.

• అధినేతతో కార్యకర్తలు

బుధవారం ఎర్రవల్లి నివాసంలో తనను కలిసేందుకు వచ్చిన మేడ్చల్ కార్యకర్తలతో సమావేశమైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

తెరపైకి హై సిటీ!

ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ స్థానంలో కొత్త పథకానికి శ్రీకారం

సమగ్ర అభివృద్ధికి 'హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్, ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్'

నిధుల సమీకరణపై స్పష్టత లేకుండా పథకం రూపకల్పన

రెండో విడత నాలాల అభివృద్ధికి ప్రణాళికలు

రూ. 582.42 కోట్లతో 35 చోట్ల పనులు

సిటీబ్యూరో, జూలై 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సమగ్ర అభివృద్ధి పేరిట కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ పథకాల స్థానంలో కాంగ్రెస్ సర్కారు 'హై సిటీ' (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్, ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్')కి రూపకల్పన చేసింది. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మౌలిక వసతుల కల్పనకు కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేసింది. సిగ్నల్ ఫ్రీ సిటీలో భాగంగా ఎస్ఆర్‌డీపీ కింద ఫ్లై ఓవర్లు, ఆర్‌యూబీ, ఆర్వోబీలు, ఇతర రోడ్ల విస్తరణ 42 పనులు చేపట్టి అనతికాలంలోనే 35 ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చి.. ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపింది. ప్రస్తుతం 7 చోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి. నాలాల అభివృద్ధికి ఎస్ఎన్‌డీపీ పథకాన్ని రూ. 985.45కోట్లతో చేపట్టిన మొదటి విడతలో రూ.592.68 కోట్లు ఖర్చు పెట్టి 39 చోట్ల పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసింది. మిగతా పనులు పురోగతిలో ఉన్నాయి. సీఆర్ఎంపీ మొదటి విడతను తీసుకొచ్చి గుంతలు లేని నగరంగా తీర్చిదిద్దింది. అయితే సీఆర్ఎంపీ, ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ రెండో విడత పథకాలకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి.. ప్రభుత్వ పరిశీలనకు పంపారు. ఇంతలో బీఆర్ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పాత పథకాల పేర్లు వినియోగంలోకి లేకుండా కొత్తగా హై సిటీ కింద అన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చింది. నిధుల సమీకరణపై మాత్రం స్పష్టత లేకుండానే నాలా రెండో దశ పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయడం గమనార్హం.



సమగ్ర అభివృద్ధికి 'హై సిటీ'

గ్రేటర్‌లో కనీస సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పన సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ సర్కారు హై సిటీ పథకానికి రూపకల్పన చేసింది. గత ప్రభుత్వ కాలంలో వివిధ వ్యూహాత్మక పథకాల పేరుతో ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించారు. ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ ద్వారా గ్రేటర్‌లో ప్రస్తుతం పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేయడం, మరింత అభివృద్ధికి నూతన పనులను ప్రతిపాదిస్తూ..ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రాధాన్యత పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. వివిధ పథకాలను అమలు చేసే బదులు ఒకే గొడుగు కింద సమగ్రాభివృద్ధికి సర్కారు 'హై సిటీ'కి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కాగా, నాలాల అభివృద్ధిలో భాగంగా ఎస్ఎన్‌డీపీ మొదటి విడత పూర్తి కాగానే ఆ పేరు వాడకంలో ఉండదు. ఈ క్రమంలో రెండో విడతలో రూ. 582.42 కోట్లతో 35 చోట్ల పనులు చేపట్టేందుకు 'హై సిటీ' కార్యక్రమం కింద చేపట్టనున్నారు. అయితే నిధుల సమీకరణపై స్పష్టత లేకుండా జోన్ల వారీగా చేపట్టే పనుల వివరాలను బుధవారం వెల్లడించారు.

డేంజర్ జోన్‌లో 17 ఏరియాలు..

రూ.361 కోట్ల ఎస్ఎన్‌డీపీ పనులపై సర్కారు శీతకన్ను

వర్షాకాలం కావడంతో భయాందోళనలో స్థానికులు

అసలే వర్షాకాలం.. ఆపై ఉన్నట్టుండి కురుస్తున్న కుండపోత వానలు.. పొంగిపొర్లే నాలాలు, చెరువులను తలపించే రహదారులు, లోతట్టు ప్రాంతాలను ముంచెత్తే వరద...వెరసి గ్రేటర్ వాసులకు కంటిమీద కునుకు లేకుండా పోతున్నది. వరద ముంపు తప్పించాల్సిన జీహెచ్ఎంసీ మాత్రం ఇంకా మొద్దు నిద్ర వీడడం లేదు. మాన్‌సూన్ పనులే కాకుండా కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలాల అభివృద్ధి పథకం (ఎస్ఎన్‌డీపీ) మొదటి దశ పనులపై నిర్లక్ష్యం వహిస్తున్నది. 75 శాతం పైగా పనులను పూర్తి చేసి.. వందల కాలనీలు, బస్తీలకు వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపింది గులాబీ సర్కారు. కానీ డిసెంబర్‌లో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గత ప్రభుత్వ ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చూపడంతో పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేయలేక జీహెచ్ఎంసీ చేతులెత్తేసింది. జీహెచ్ ఎంసీ పరిధి, అవతల కలిపి రూ.985.45కోట్లతో చేపట్టిన మొదటి విడత ఎస్ఎన్‌డీపీ పనులు రూ.592.68కోట్లు ఖర్చు పెట్టి 39 చోట్ల పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసింది. కానీ కాంగ్రెస్ సర్కారు ఒక్కటంటే ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. ప్రస్తుతం రూ. 361.16 కోట్లతో 17 చోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఈ 17 ప్రాంతాలు డెంజర్ జోన్‌లో ఉన్నాయి. సకాలంలో పనులు పూర్తి కాకపోతే ముంచెత్తే వరద నీటితో జీవితాలు అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉన్నదని ఆయా ప్రాంతాల వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా లంగర్‌హౌస్, కోమటికుంట, మీర్‌పేట తలాబ్, బడంగ్‌పేటలో న్యాయపరమైన చిక్కులతో పనులు నిలిచిపోయాయి. ఎస్ఎన్‌డీపీ పనులను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్

సమన్వయంతో పనిచేద్దాం

ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో: వర్షాకాలం వేళ ఈవీడీఎం విభాగం, పోలీసులు సమన్వయంతో పని చేసి నగరంలో వర్షం నీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకుందామని ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్ అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్లపై వర్షం నీరు నిలిచిపోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలపై ట్రై కమిషనరేట్లు (హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ) పరిధిలో డీసీపీలు, ఏసీపీలు, ట్రాఫిక్ పోలీసుల అధికారులతో బుధవారం రంగనాథ్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అధిక వర్షపాతం నమోదైనప్పుడు ఆక్రమణలకు గురైన ప్రాంతాల్లో పాటు వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీరు నిల్వకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలతో పాటు ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగించడం వంటి అంశాలపై చర్చించారు. కమిషనర్ రంగనాథ్ గాజులరామారంలో జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. సర్వే నంబర్ 299, 300, 301, 298, 295లలోని భూములను పరిశీలించారు.

జీహెచ్ఎంసీకి ఈవీడీఎం శాఖలు బదిలీ

సిటీబ్యూరో, జూలై 3 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ, ఈవీడీఎంల మధ్య నెలకొన్న సమన్వయ లోపానికి శుభం కార్డు పడింది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా)ను ప్రభుత్వం ఏర్పాటు చేయగా, ఏవీ రంగనాథ్ సారథ్యంలో ఈ విభాగం పనిచేయనున్నది. అయితే ఈవీడీఎం పరిధిలో ఉన్న అడ్వర్టయిజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్టు శాఖలను జీహెచ్ఎంసీకి బదిలీ చేస్తూ బుధవారం కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విభాగాలకు అదనపు కమిషనర్లను నియమించగా, ప్రకటన విభాగం అదనపు కమిషనర్‌గా కె. సత్యనారాయణ, ట్రాన్స్‌పోర్టుకు సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. శానిటేషన్ (హెల్త్) బాధ్యతలు పంకజకు అప్పగించారు.

నేడు నీళ్లు బంద్

సిటీబ్యూరో, జూలై 3 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే సింగూరు 3, 4 ఫేజ్‌లకు విద్యుత్ సరఫరా చేసే 123 కేవీ పెద్దాపూర్, కంది సబ్‌స్టేషన్లలో టీజీ ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతు పనులు చేపడుతున్నారు. గురువారం(నేడు) ఉదయం 7 గంటల నుంచి మరుసటి రోజు 5వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటల వరకు ఈ పనులు జరుగుతాయని, 24 గంటల పాటు పలు రిజర్వాయర్ల పరిధిలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలు

షేక్‌పేట, భోజగుట్ట రిజర్వాయర్ (లోప్రెజర్), జూబ్లీహిల్స్, సోమాజిగూడ, బోరబండ, బంజారాహిల్స్ , ఎర్రగడ్డ, మూసాపేట, కేపీహెచ్‌బీ, హైదర్‌నగర్, నల్లగండ్ల, చందానగర్, హుడా కాలనీ, హఫీజ్‌పేట్, మణికొండ, నార్సింగి, మంచిరేవుల, తెల్లాపూర్, బల్క్ కనెక్షన్లకు నీటి అంతరాయం ఉంటుందని, ఆయా ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అదికారులు సూచించారు.

స్నాప్‌చాట్‌తో డ్రగ్స్

విద్యార్థులే లక్ష్యంగా సిటీలో మత్తు దందా

ముగ్గురు నిందితులు సహా 8 మంది వినియోగదారులు అరెస్ట్

షాద్‌నగర్‌లోని ఓ కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు గుర్తింపు

సిటీబ్యూరో, జూలై 3 (నమస్తే తెలంగాణ): నగరంలో విద్యార్థులే లక్ష్యంగా డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులతో పాటు 8 మంది వినియోగదారులను టీజీ న్యాబ్ పోలీసులు అరెస్టు చేశారు. అంతే కాకుండా షాద్‌నగర్‌లోని ఓ కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బుధవారం నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వివరాలు వెల్లడించారు. లంగర్‌హౌజ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అక్రమ్, కార్ఖానకు చెందిన సీఎస్. ప్రణయ్, వెస్ట్‌మారేడ్‌పల్లికి చెందిన రోహన్ విలియమ్ ముఠాగా ఏర్పడి విద్యార్థులే లక్ష్యంగా నగరంలోని పలు విద్యాసంస్థల్లో డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్నారు. స్నాప్‌చాట్ ద్వారా విద్యార్థుల నుంచి ఆర్డర్లు తీసుకుని, అవసరమున్న వారికి వారు కోరుకున్న డ్రగ్స్ విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రాము ఓజీ వీడ్ రూ.4000, ఒక ఎల్ఎస్‌డీ బ్లాట్ రూ.3000 చొప్పున విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న టీజీ న్యాబ్ పోలీసులు రెండు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి పలు విద్యాసంస్థల వద్ద నిఘా పెట్టారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న మహ్మద్ అక్రమ్, ప్రణయ్, రోహన్‌లను టీజీ న్యాబ్ పోలీసులు కార్ఖానా పోలీసులతో కలిసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డ్రగ్స్ వినియోగిస్తున్న మలకపేటకు చెందిన సాయి పృథ్వీనాథ్ రెడ్డి(26), రాయదుర్గానికి చెందిన సాయిచరణ్‌రెడ్డి(29), జూబ్లీహిల్స్‌కు చెందిన సూర్య తేజ, జూబ్లీహిల్స్‌కు చెందిన నిఖిల్‌రెడ్డి(29), బంజారాహిల్స్‌కు చెందిన విద్యార్థి అర్జున్ చౌదరి(19), జూబ్లీహిల్స్‌కు చెందిన విద్యార్థి ఆదిత్యనారాయణరెడ్డి(20), సికింద్రాబాద్ పద్మారావునగర్‌కు చెందిన రోషణ్‌సింగ్(28)తో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా, షాద్‌నగర్‌లోని ఓ కాలేజీకి చెందిన 20 మంది విద్యార్థులు పేర్లు బయటకు వచ్చాయి. దీంతో పోలీసులు సదరు విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి..డ్రగ్స్‌కు బానిసైన పిల్లలను డీ-అడిక్షన్ సెంటర్‌లో చేర్పిస్తున్నట్లు తెలిపారు.

సిటీలో 40 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

సిటీబ్యూరో, జూలై 3 (నమస్తే తెలంగాణ): నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న 40 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీసు కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈ బదిలీల్లో భాగంగా లూప్‌లైన్‌లో ఉన్న పలువురికి ఎస్‌హెచ్‌ఓలుగా పోస్టింగ్ కల్పించారు. 14 మందిని మల్టీజోన్‌కు అటాచ్ చేయగా మరికొందరిని ఇతర విభాగాలకు బదిలీ చేశారు.

బుధవారం నిలోఫర్ దవాఖానలో చికిత్స పొందుతున్న చిన్నారి ఆరోగ్య స్థితిని తెలుసుకుంటున్న హైదరాబాద్ జిల్లా అనుదీప్ దురిశెట్టి

కలెక్టర్ ఉద్వేగం..!

నిలోఫర్‌లో చిన్నారుల అనారోగ్య సమస్యలు తెలుసుకున్న అనుదీప్ దురిశెట్టి

వారితో ముచ్చటిస్తూ.. తల్లిదండ్రులతో మాట్లాడిన కలెక్టర్

సిటీబ్యూరో, జూలై 3 (నమస్తే తెలంగాణ): ఓ చిట్టి తల్లి గుండెకు రంధ్రం.. ఇంకొకరికి బ్లడ్ ఇన్‌ఫెక్షన్.. ఇలా ఒక్కొక్కరు..ఒక్కో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారుల పరిస్థితులను తెలుసుకొని.. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉద్వేగానికి గురయ్యారు. నిలోఫర్ ఆసుపత్రిని కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. నేరుగా వార్డుల్లోకి వెళ్లి వైద్య సేవలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. అక్కడికి వచ్చిన చిన్నారులు, తల్లిదండ్రులతో మాట్లాడి వైద్య సేవలు తక్షణం అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. రెండున్నర గంటల పాటు ప్రతి ఒక్క వార్డును పరిశీలించారు. అనంతరం నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణితో కలిసి ఇంటెన్సివ్ కేర్ బ్లాక్, డయాగ్నస్టిక్ ల్యాబ్, రక్త కేంద్రం, క్వాలిటీ కంట్రోల్ రూం, సీసీటీవీ, ఫిజియోథెరపీ, పిరియాడికల్ సర్జికల్ వార్డ్, ఆపరేషన్ థియేటర్ తదితర బ్లాక్‌లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పుట్టుకతో వచ్చే లోపాలతో పిల్లలు జీవితాంతం బాధపడాల్సిన పరిస్థితి రాకుండా వైద్యులు సకాలంలో వైద్యం అందించాలని సూచించారు. చికిత్స అందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా ఉండకూడదని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంపై ఎస్బీహెచ్‌ఓలు, ఆర్‌బీఎస్‌కే వైద్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ వెంకట్, వైద్యులు ప్రసాద్, నాగజ్యోతి, రామ్ రెడ్డి, కల్యాణి శ్రీనివాస్, గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రెండ్రోజులుగా నిలోఫర్ దవాఖానను హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లు సందర్శించారు. ఈనెల 2న నిలోఫర్ హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ స్థానిక ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.నరేందర్‌కుమార్‌లతో కలిసి హెడీఎస్ సమావేశం నిర్వహించారు. అంతకు ముందు కలెక్టర్ శశాంక్ దవాఖాన మొత్తం కలియతిరిగారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయలను పరిశీలించారు.